జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



బుధవారం | 25-3-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 625 పేజీలు: 4 వెల : రూ.7








# ఎక్సైజ్ అధికారుల.. వాటాల పందేరం!

* షాపుల్లో మద్యం అధిక ధరకు విక్రయం * నెలకు రూ.కోటిన్నర అక్రమ వసూళ్లు * దీని వెనుక దుకాణదారులే కాకుండా అధికారుల హస్తం * కింద నుండి పైదాకా పక్కాగా 'లైన్'! * డిప్యూటీ కమిషనర్ నుండి సీఐల వరకు వాటాల పంపకం





**శ్రీకాకుళం, మార్చి 24 (వార్త):** శ్రీకాకుళం జిల్లా ఎక్సైజ్ శాఖ అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ప్రభుత్వం నిర్దేశించిన ఎంఆర్‌పీ ధరలకు పాతరేసి, జిల్లా వ్యాప్తంగా ఉన్న 174 మద్యం దుకాణాల్లో 'పది రూపాయల' దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ఈ అక్రమ వసూళ్ల వెనుక కేవలం దుకాణదారులే కాదు, ఎక్సైజ్ శాఖలోని అత్యున్నత స్థాయి అధికారుల హస్తం కూడా ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కింద స్థాయిలోని 10 మంది సిఐల నుండి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్, చివరకు డిప్యూటీ కమిషనర్ వరకు ఈ అక్రమ సొమ్ము 'నజరానా'గా చేరుతోందని సమాచారం.


## నెలకు రూ.1.50 కోట్ల దోపిడీ!

జిల్లా వ్యాప్తంగా రోజుకు సగటున 50 వేల వరకు బీర్లు, బ్రీజర్లు విక్రయాలు జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఒక్కో సీసాపై వసూలు చేస్తున్న రూ.10 అదనపు బాదుడుతో నెలకు సుమారు రూ. కోటిన్నర మేర అక్రమ ఆదాయం సమకూరుతోంది. ఈ మొత్తాన్ని జిల్లాలోని ఎక్సైజ్ అధికారులు పక్కా ప్రణాళికతో పంచుకుంటున్నారు. జిల్లాలోని 10 మంది ఎక్సైజ్ సిఐలకు తమ పరిధిలోని షాపుల నుండి నెలవారీగా భారీ మొత్తంలో మామూళ్లు అందుతున్నాయి. టెక్కలి, శ్రీకాకుళం పరిధిలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్లతో పాటు జిల్లాలోనే ఉండే ఉండే డిప్యూటీ కమిషనర్ (జిల్లా ఎక్సైజ్ అధికారి) స్థాయి వరకు ఈ వాటాలు వెళ్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. "పైన వాళ్లకి ఇచ్చుకోవాలి.. అందుకే రేట్లు పెంచాం" అని దుకాణదారులు బహిరంగంగానే చెబుతుండటం అధికారుల అండదండలకు నిదర్శనం.

## బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట!

శ్రీకాకుళం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సిఐ వైఖరిపై వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫోన్ చేసినా ఎత్తకపోవడం, ఫిర్యాదు చేసినా బుట్టదాఖలు చేయడం చూస్తుంటే.. ఆయన తన వాటా కోసం అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నట్లు స్పష్టమవుతోంది. సామాన్యుడు చమటోడ్చి సంపాదించిన సొమ్మును, 'కూలింగ్' పేరుతో అధికారులు ఇలా పంచుకుంటూ జల్సా చేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.




## వాటాల పర్వం ఆగాలంటే..

జిల్లాలో జరుగుతున్న ఈ వ్యవస్థీకృత దోపిడీపై ఏసీబీ లేదా ఉన్నత స్థాయి విచారణ జరగాలని జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు. కేవలం కింది స్థాయి సిబ్బందిని కాకుండా, ఈ వాటాల్లో భాగస్వాములైన డిప్యూటీ కమిషనర్, సూపరింటెండెంట్ స్థాయి అధికారుల చిట్టాను కూడా బయటకు తీయాలని కోరుతున్నారు.


(షాపులకి మంత్లీ వసూళ్లు, సిండికేట్ కింగులు.. తదితర అంశాలతో మళ్లీ కలుద్దాం)


# గ్యాస్.. ట్రబుల్స్



* బుక్ చేసి 20 రోజులు దాటుతున్నా పంపిణీ కాని గ్యాస్ సిలిండర్లు
* ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు
* హెూటళ్లు, ధాబాలకు తరలిపోతున్న సిలిండర్లు
* గ్యాస్ సిలిండర్ కావాలంటే వెయ్యి రూపాయలు అధికంగా ఇవ్వాల్సిందే * గ్యాస్ ఏజెన్సీలపై కొరవడిన పర్యవేక్షణ
* అక్రమంగా స్టాక్ చేసిన ఏజెన్సీలపై చర్యలేవీ? * ప్రకటనలకే పరిమితమైన జిల్లా అధికారులు

**శ్రీకాకుళం, మార్చి 24 (వార్త):** పశ్చిమాసియాలో యుద్ధం సామాన్యులకు గుదిబండగా మారగా, పలు గ్యాస్ ఏజెన్సీలకు మాత్రం వరంలా మారింది. గతంలో గ్యాస్ బుక్ చేసుకుంటే ఒకటి రెండు రోజుల్లో వచ్చే గ్యాస్ ప్రస్తుతం వారాలు గడుస్తున్నా అందడం లేదు. గ్యాస్ కోసం వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎప్పుడు గ్యాస్ వస్తుందో అన్నది ఏజెన్సీ ప్రతినిధులు స్పష్టత ఇవ్వడం లేదు. మున్ముందు ఇలానే కొనసాగితే గ్యాస్ ఏజెన్సీల వద్ద వినియోగదారులు ఆందోళనకు దిగే అవకాశం లేకపోలేదు. కాగా, గ్యాస్ సిలిండర్లు బ్లాక్‌లో తరలిపోతుందన్న విమర్శలు లేకపోలేదు. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో కొందరు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు అధిక ధరకు విక్రయిస్తున్నారని వినియోగదారులు బహిరంగంగా చెబుతున్నారు. హెూటళ్లు, ధాబాలకు నిత్యం గ్యాస్ సిలిండర్లు తరలిపోతోంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఒక్కో గ్యాస్ సిలిండర్ వినియోగదారుడి అవసరాన్ని బట్టి అదనంగా రూ.300 నుంచి రూ.1000 వరకు విక్రయిస్తున్నారు. గ్యాస్ కోసం ఏం చేయాలో తెలియక బహిరంగ మార్కెట్‌లో అధిక డబ్బులు ఇచ్చి మరీ గ్యాస్‌ను కొనుగోలు చేసుకుంటున్నామని కొందరు వాపోతున్నారు. శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా 38 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. 6,12,000 డొమెస్టిక్ గ్యాస్ కనెక్షన్‌లు, 4,320 కమర్షియల్ గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నాయి. గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేసిన ఇరవై రోజుల్లోపే అందని పరిస్థితి ఉంది. సిలిండర్లు లేకపోవడంతో గృహ వినియోగదారులు ఇండెక్షన్ స్టవ్‌లను కొనుగోలు చేసుకుని వంటలు చేస్తున్నారు. రోడ్డు పక్కన ఉన్న చిన్నచిన్న హెూటళ్లు మూతపడ్డాయి. పెద్దపెద్ద హెూటల్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు మాత్రం తమకు తెలిసిన వారి ద్వారా కమర్షియల్ సిలిండర్లు తెచ్చుకుంటున్నారు. ధాబాల్లో మాత్రం కట్టెలపొయ్యిపై వంటలు చేస్తున్నారు. జిల్లా అధికారులు మాత్రం గ్యాస్ కొరత లేదనే చెబుతూ ప్రకటనలు చేస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిలిండర్లు బ్లాక్‌లో విక్రయాలు జోరుగా సాగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి.









## ఆరేళ్ల బాలికపై లైంగిక దాడి

* పోలీసులకు బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు
* పోక్సో చట్టం కింద కేసు నమోదు

**ఇచ్ఛాపురం మార్చి24(వార్త):** ఇచ్ఛాపురం మండలంలోని ఓ గ్రామంలో ఆరేళ్ల బాలికపై లైంగిక దాడి జరిగిందని రూరల్ ఎస్ఐ ఆర్.జనార్ధనరావు తెలిపారు. ఈ నెల 18 న ఉదయం 11 గంటల ప్రాంతంలో బాలిక ఆడుతుండగా అదే గ్రామానికి చెందిన లండ తులసీ రెడ్డి అనే 31 ఏళ్ల యువకుడు ఆ పాపను పక్కకి ఎవరు లేని ప్రదేశానికి తీసుకెళ్ళి లైంగిక దాడికి పాల్పడ్డాడు. మంగళవారం రూరల్ పోలీస్ స్టేషన్లో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రూరల్ ఎస్ఐ జనార్ధనరావు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉగాది ముందురోజు జరిగిన సంఘటన అనంతరం పెద్దలు పంచాయతీ విఫలం కావడంతో ఆలస్యంగా పోలీస్ స్టేషన్‌ను బాధితుల కుటుంబీకులు ఆశ్రయించారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

### ఎస్ఐ ఆర్ నరసింహమూర్తి

**పలాస, మార్చి 24(వార్త):** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని కాశీబుగ్గ ఎస్ఐ ఆర్ నరసింహమూర్తి అన్నారు. మంగళవారం రామకృష్ణాపురం గ్రామం సందర్శించి నారీ శక్తి, సైబర్ క్రైమ్, బాల్య వివాహాలు, సంకల్పం, మైనర్ డ్రైవింగ్ పై అవగాహన సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వివాహాలు తెరిపిస్తే కఠిన శిక్ష ఉంటాయని హెచ్చరించారు. పోలీసు లేదా బ్యాంకు పేరుతో ఫోన్‌లు చేసి డబ్బు డిమాండ్ చేస్తారని, డిజిటల్ అరెస్ట్ అని బెదిరిస్తారని హెచ్చరించారు. అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకండి, సమాచారం ధృవీకరించుకోవాలని,వ్యక్తిగత ఫోటోలు, వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని, మోసం గ్రహించిన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ మోసంలో డబ్బు పోగొట్టుకున్నప్పుడు వెంటనే చర్య తీసుకోవడం చాలా కీలకమని, మొదటి 24-48 గంటల్లో ఫిర్యాదు చేస్తే డబ్బు తిరిగి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# పలాసలో కంకర మాఫియాపై ఉక్కుపాదం

**-అర్ధరాత్రి మెరుపుదాడులు**

**-జేసీబీలు, టిప్పర్లు సీజ్**

**-రెక్కీతో మాఫియా దూకుడు బహిర్గతం**


**-అనుమతులు లేకుండా కోట్లకు**

**దండుకున్న కంకర మాఫియా?**

**-అధికారుల కఠిన చర్యలు**

**-పరారీలో ముఠా సభ్యులు**

**-మాఫియా మాయాజాలం వెలుగులోకి**





**పలాస, మార్చి 24 (వార్త):** కంబిరిగాం పరిసర ప్రాంతాల్లో అక్రమంగా జరుగుతున్న మట్టి, కంకర తవ్వకాలపై రెవెన్యూ, పోలీసు శాఖలు సంయుక్తంగా ఉక్కుపాదం మోపాయి. తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో అర్ధరాత్రి నిర్వహించిన మెరుపుదాడుల్లో అక్రమ తవ్వకాలకు వినియోగిస్తున్న రెండు జేసీబీలు, రెండు టిప్పర్లను అధికారులు సీజ్ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా రాత్రివేళల్లో ప్రకృతి సంపదను దోచుకుంటున్న మాఫియాపై అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. దాడుల సమయంలో మరికొన్ని వాహనాలు అక్కడి నుంచి పరారైనట్టు సమాచారం. మొత్తం మూడు జేసీబీలు, పలు టిప్పర్లు తప్పించుకున్నాయని అధికారులు వెల్లడించారు. రెవెన్యూ, పోలీసు బృందాల కదలికలను ముందుగానే బయట పడింది. గత కొంతకాలంగా కంబిరిగాం, కొత్తూరు, రాజగోపాల పురం, లొద్దభద్ర, మహాదేవపురం, కోసంగిపురం ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు విస్తృతంగా జరుగుతు న్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. ప్రస్తుతం పరారీలో ఉన్న ముఠా సభ్యుల గుర్తించిన ముఠా సభ్యులు సమాచారాన్ని చేరవేసుకుని తప్పించుకుం టున్నట్టు విచారణలో జేసీబీ వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. అక్రమ తవ్వకాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. అనుమతులు లేకుండా మట్టి, కంకర తవ్వకాలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు రూ.2 లక్షల వరకు జరిమానా విధించనున్నట్లు స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే.. కేజీఎఫ్ సినిమాను తలపించేలా మాఫియా వ్యవహారం నడుస్తున్నట్టు అధికారుల దర్యాప్తులో బయటపడింది. జాతీయ రహదారి, కంబిరిగాం బ్రిడ్జి పరిసరాల్లో ప్రతి కిలోమీటర్‌కు ఒకరిని రెక్కీగా ఉంచి, అధికారుల కదలికలను గమనిస్తూ ముఠా సభ్యులు కార్లలో సంచరిస్తున్నట్టు గుర్తించారు. పరిస్థితులు అదుపు తప్పితే అధికారుల పై దాడులకు కూడా దిగబడే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ఈ దాడుల్లో కాశీబుగ్గ ఎస్సై నరసింహమూర్తి, ఆర మన్మధరావు సహా రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అక్రమ తవ్వకాలపై ఇకపై నిరంతరం ప్రత్యేక దాడులు కొనసాగిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

## కోమర్తి పాఠశాలలో జీఎఫ్ఎల్ఎన్ టెస్ట్



**నరసన్నపేట, మార్చి 24 (వార్త):** కోమర్తి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జీఎఫ్ఎల్ఎన్ టెస్ట్ నిర్వహించారు. సమగ్ర శిక్ష సిఆర్ఎంటీ పెద్దవాడు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిగతంగా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో విద్యార్థులు ఇచ్చిన సమాధానాల ఆధారంగా వారి గ్రేడులను నిర్ణయించనున్నారు. గతంలో ఆగస్టు నెలలో బేస్ లైన్ టెస్ట్ నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రస్తుత ఎండ్ లైన్ టెస్ట్ ఫలితాలను ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసి విద్యార్థుల ప్రగతిని అంచనా వేస్తారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డ్రగ్స్, ర్యాగింగ్ నివారణపై అవగాహన



**ఎచ్చెర్ల, మార్చి 24(వార్త):** కళింగపట్నం మెరైన్ సబ్ ఇన్స్పెక్టర్ హరికృష్ణ రావు ఆధ్వర్యంలో డ్రగ్స్, ర్యాగింగ్, మహిళలపై దాడుల నివారణపై అవగాహన కార్యక్రమం మంగళవారం బడేవానిపేట జడ్పీహెచ్ స్కూల్‌లో నిర్వహించారు. స్కూల్ హెడ్ మాస్టర్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు




**నరసన్నపేట, మార్చి 24 (వార్త):** తామరపల్లి సర్వీస్ రోడ్డులో మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కోటబొమ్మాళి నుంచి కళాశాల విద్యార్థులతో వస్తున్న ఆటో, ఎదురుగా వచ్చిన ఓ స్కూల్ బస్సును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఢీకొన్న సమయంలో ఆటోలో ప్రయాణిస్తున్న మాధురి, ఝాన్సీ, హరి, సంతోష్ గాయపడ్డారు. గాయపడిన వారిని అత్యవసర సేవల 108 వాహనంలో సమీప ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రవీణ్ పగడాలకి నివాళులు



**ఇచ్ఛాపురం మార్చి 24 (వార్త):** దైవ సేవకుడు ప్రవీణ్ పగడాల వర్ధంతి సందర్భంగా ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి, సోంపేట బిషప్ రెవ.డా.కొత్తపల్లి అబ్రహం ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా డా.ప్రత్తి అన్వేష్ (అల్ ఇండియా క్రిస్టియన్ పాస్టర్స్ ఫెడరేషన్ కోఆర్డినేటర్) మాట్లాడుతూ క్రైస్తవుల పై సమాజములో, రాష్ట్రములో, దేశములో జరుగుచున్న మార్పులను గుర్తు చేస్తూ, ఏ సమయములో పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియదు గనుక ప్రతి దానికి ప్రార్థన పూర్వకముగా సిద్ధముగా ఉండాలని కొన్ని సూచనలు తెలియజేశారు. ప్రార్థనలతో ఘనంగా ముగించారు.

## ప్రతిభ కనబర్చిన విద్యార్థినిలకు సన్మానం



**ఇచ్ఛాపురం మార్చి 24(వార్త):** బాలకృష్ణాపురం ప్రాథమిక పాఠశాలలో సైన్స్ ఫెయిర్ పార్టిసిపేట్‌లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానించారు. స్కూల్ హెచ్ఎం కృష్ణారావు, అప్పలనాయుడు, శ్రీనివాసరావు, పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి లోహిదాసును సన్మానించారు. జిల్లాస్థాయిలో బాలకృష్ణాపురం స్కూల్‌కి మూడు అవార్డులు తెచ్చిన విద్యార్థులు కోట పావని, కోట మణి, ఊళ్ల అరుణ్‌ను అభినందించారు.

## సరుబుజ్జిలిలో విశాఖ డెయిరీ పార్లర్

**సరుబుజ్జిలి, మార్చి 24 (వార్త):** సరుబుజ్జిలిలో విశాఖ డెయిరీ పార్లర్‌ను విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమ అభివృద్ధికి ఇలాంటి పార్లర్లు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా వైస్ ప్రెసిడెంట్ వేల్పుల గోవిందరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు దవల సింహాచలం, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమంలోహాజరయ్యారు.



# క్షయని నివారిద్దాం..ఆరోగ్య సమాజాన్ని నిర్మిద్దాం!

### -జిల్లా వైద్యాధికారిణి కె.అనిత



**శ్రీకాకుళం, మార్చి 24(వార్త):** ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యాధికారి వారి కార్యాలయం నుండి స్థానిక ఏడు రోడ్ల కూడలి వరకు క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం ప్రజా ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అనే నినాదాలతో ర్యాలీని కొనసాగించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ టి.బి. ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా టిబి నివారణకు 100 రోజుల కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 2.0 మిషన్లు, టిబి నాట్ మిషన్లు ఉన్నాయని ఈ వందరోజుల కార్యక్రమంలో భాగంగా 77 పంచాయితీలను 1000 మంది పాపులేషన్ లెక్కన తీసుకొని ఒకటి కంటే తక్కువ ఉన్న పంచాయతీలను టీవీ ముక్త పంచాయతీలుగా ఒకటి లేక ఎక్కువ కేసులు ఉన్న పంచాయతీని సిల్వర్ పంచాయతీగా ఒకటి లేక సున్నా ఉన్న పంచాయతీలను గోల్డ్ పంచాయతీలుగా నిర్ణయించడం జరుగుతుందని తెలిపారు. ఈ వ్యాధి బారిన పడినవారు క్రమం తప్పకుండా ఆరు నెలలు మందులు వాడినట్లయితే వ్యాధి నివారణ జరుగుతుందని ఇందుకోసం టిబి సూపర్వైజర్లు ఉన్నారని, జిల్లాలో 9 యూనిట్లు ఉన్నాయని తెలిపారు. క్షయ వ్యాధి (టీ) నివారణపై ప్రజలకు అవగాహన కల్పించుట జరుగుతుందని అన్నారు. జిల్లాలో ఇప్పటికి 506 కేసులు ట్రీట్మెంట్ లో ఉన్నాయని, టిబి కేసులు 12, మరియు టి.బి. హెచ్ఐవి కేసులు 12 ఉన్నట్లు తెలిపారు. క్షయ వ్యాధి ప్రధానంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుందని తెలిపారు. సరైన జాగ్రత్తలు తీసుకుంటే ఈ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చునని చికిత్స ద్వారా నయం చేయవచ్చని తెలిపారు. ఈ వ్యాధి బారిన పడినవారు పోషకాహారం (పాలు, పండ్లు, కూరగాయలు)తీసుకోవాలని రోగ నిరోధక శక్తిని పెంచే అలవాట్లు పాటించాలని అన్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప వైద్య కేంద్రానికి వెళ్లాలని సూచించారు. ఈ టి.బి. వ్యాధి గ్రస్తులు సరైన మందులతో పాటు పోషకాహారం తీసుకోవాలని అందువలన ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా టి.బి రోగులకు వంద మందికి పోషకాహారం కిట్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టి.బి. నివారణ అధికారి టి.శ్రీకాంత్, వైద్యాధికారులు, ప్రభుత్వ రిమ్స్, జేమ్స్ ఆసుపత్రి ( నర్సు) శిక్షణ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు మంత్రి వెంకటస్వామి పాల్గొన్నారు.

# గేట్ విజేతలకు ఘన సత్కారం



**ఎచ్చెర్ల, మార్చి 24(వార్త):** జాతీయ స్థాయి గేట్-2026 పరీక్షలో ఉత్తమ ర్యాంకులు సాధించిన శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం విద్యార్థులను మంగళవారం క్యాంపస్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో డైరెక్టర్ ప్రొఫెసర్ సండ్ర అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల పట్టుదల, నిరంతర కృషే ఈ విజయానికి కారణమని ప్రశంసించారు. ఈ పరీక్షలో సాయి గణేష్ గోండు 31వ ర్యాంకు, ఇంటూరి ఉమేష్ చంద్ర 77వ ర్యాంకు సాధించగా, మరో 20 మంది ఉత్తమ ర్యాంకులు కైవసం చేసుకున్నారు. క్యాంపస్ నుండి మొత్తం 120 మంది విద్యార్థులు అర్హత సాధించడం పట్ల డైరెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. పరిపాలనాధికారి డాక్టర్ ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ డాక్టర్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు, మాజీ డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఈఐటీపీ డీన్ పి. శ్యామ్, హయ్యర్ ఎడ్యుకేషన్ సెల్ కో-ఆర్డినేటర్లు ఎం. రామకృష్ణ, పి. సతీష్, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్లు సింహాచలం, యోగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ ధరకు రైతులకు నాణ్యమైన వస్తువులు

### డిసిఎంఎస్ అధ్యక్షులు చౌదరి అవినాష్

**శ్రీకాకుళం, మార్చి 24(వార్త):** తక్కువ ధరకు రైతులకు నాణ్యమైన వస్తువులు అందిస్తున్నట్లు డిసిఎంఎస్ అధ్యక్షులు చౌదరి అవినాష్ వెల్లడించారు. మంగళవారం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ, ప్రధాన కార్యాలయంలో 69వ ద్వితీయ వార్షిక మహాజన సభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సభ్యులుగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా జిల్లాలో ఉన్న రైతులకు అవసరమగు పాడి రైతులకు కావలిసిన పశువుల ధాణ, టార్పాలిన్స్, మొదలైన వ్యాపారాల సంఘం ద్వారా చేసినచో తద్వారా పిఎసిఎస్ లు, డిసిఎంఎస్ లు ద్వారా ఆదాయం వచ్చుటయే కాకుండా రైతులకు తక్కువ ధరకు నాణ్యమైన వస్తువులు సరఫరా చేయగలుగుతామన్నారు. అంతేకాకుండా అరసవల్లి సంఘ ఆవరణలో ఉన్న పూర్వపు రైస్ మిల్లును కళ్యాణమండపంగా తయారు చేసి ప్రజలకు అందుబాటులో ధరలో ఇచ్చుటకు అవకాశం ఉంటుందని చెప్పారు. జిల్లాలో గల డిసిఎంఎస్ అమ్మకం కేంద్రాలకు సీసీ కెమెరాలు, ఏర్పాటు చేయుటకు కూడా సభ్యులతో చర్చించడం జరిగిందన్నారు. పాలకొండలో గల సంఘం స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఇంజనీర్ వారి ఎస్టిమేషన్ ప్రకారం 90 లక్షలు అంచనా వ్యయంతో మహాజన సభ సభ్యులతో చర్చించుట జరిగినట్లు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథ స్వామి, డీసీసీబీ సిఈఓ డి.సత్యనారాయణ, మహాజన సభ సభ్యులు, సహకార శాఖ అధికారులు, సంఘ బిజినెస్ మేనేజర్ మార్పు జగ్గునాయుడు, తదితరులు పాల్గొన్నారు.




## పోతయ్యవలస పాఠశాల ఎంఈఓ తనిఖీ



**నరసన్నపేట, మార్చి 24 (వార్త):** పోతయ్యవలస ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈఓ-2 దాలినాయుడు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించాలని, విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఆయన స్పష్టం చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కూడా సూచించారు. ఈ తనిఖీలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సిరిమానోత్సవాల్లో ఆకట్టుకున్న పోటీలు

**జలుమూరు, మార్చి 24 (వార్త):** అంధవరం గ్రామంలో సిరిమానోత్సవాల సందర్భంగా వెయిట్ లిఫ్టింగ్, సంగిడి క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం జరిగిన ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. క్రీడాకారుల ప్రతిభ, పోటీ స్ఫూర్తి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఉత్సాహభరిత వాతావరణంలో పోటీలు సాగాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేసినట్లు తెలిపారు. మంగళవారం జరగనున్న పండగ ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## గాలికుంటు వ్యాధి టీకాలు ముమ్మరం

**-వెయ్యికి పైగా పశువులకు రక్షణ**

**నరసన్నపేట, మార్చి 24 (వార్త):** పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ముమ్మరంగా అందజేస్తున్నామని పశు వైద్యాధికారి రవి సాహు తెలిపారు. మంగళవారం యారబాడు సచివాలయ పరిధిలో గోకయ్య వలస తదితర గ్రామాల్లో టీకా కార్యక్రమం కొనసాగిందన్నారు. పాడి రైతులకు సమాచారం అందించి వ్యాధి పట్ల అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు వెయ్యికి పైగా పశువులకు టీకాలు అందించినట్లు ఆయన వెల్లడించారు. రైతులు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.



## ప్రకృతి సేద్యంపై అవగాహన పెంపొందించుకోవాలి



**మెళియాపుట్టి, మార్చి 25(వార్త):** ప్రకృతి సేద్యంపై ప్రతి ఒక్క రైతు మరింతగా అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రామారావు అన్నారు. వ్యవసాయ అధికారి దానకర్ణుడు నేతృత్వంలో మండలంలో గల ముక్తాపురం, మురికింటిభద్ర, గోకర్ణపురం, సంతలక్ష్మీపురం తదితర గ్రామాలలో మంగళవారం నాడు రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్షేత్రస్థాయిలో ఉన్న రైతులుతో మాట్లాడుతునే పంచ సూత్రాల అమలు దిశగా రైతన్న మీకోసం కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమంలో రైతులతో ముందుగా అన్నదాత సుఖీభవ, పి యం కిసాన్ తదితర పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. నీటి లభ్యత, డిమాండ్ ఆధారిత పంటల సాగు అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు అను పంచసూత్రాల గురించి రైతులకు అవగాహన కల్పిస్తూనే, ఏలినినో ప్రభావము, పిఎండిఎస్ ల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.దానకర్ణుడు, సర్పంచ్ భాస్కర రావు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి లండ వెంకట్రావు, కూటమి నాయకులు రమేష్, విష్ణుపండ, తిరుపతిరావు, వ్యవసాయ విస్తరణధికారిని ప్రభావతి, గ్రామ వ్యవసాయ సహాయకులు కవిత, భాస్కర్, స్వాతి, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సారవకోటలో విశాఖ డెయిరీ పార్లర్ ప్రారంభం



**సారవకోట, మార్చి 24 (వార్త):** సారవకోటలో విశాఖ డెయిరీ పార్లర్‌ను నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమ అభివృద్ధికి ఇలాంటి పార్లర్లు దోహదపడతాయని తెలిపారు. రైతులకు, పాడి రైతులకు ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చిన్నాల కూర్మినాయుడు, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్ కుమార్, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు పొద్దిన రత్నాలు నాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే సారవకోట పిఎసిఎస్ చైర్మన్ సురవరపు తిరుపతిరావు, చిన్నాల వెంకట సత్యనారాయణ, వైస్ ఎంపీపీ ప్రతినిధి శోభనపురం మురళీధర్, క్లస్టర్ ఇంచార్జ్ పట్ట ఉమామహేశ్వరరావు, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ప్రియాగ్రహారంలో పశువులకు టీకాలు



**పోలాకి, మార్చి 24 (వార్త):** ప్రియాగ్రహారం పశు వైద్య కేంద్రంలో గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు అందిస్తున్నట్లు పశువైద్యాధికారి సిహెచ్ షణ్ముఖరావు తెలిపారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా పాడి రైతులకు వ్యాధి నివారణపై అవగాహన కల్పించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా సుమారు 200 పాడి పశువులకు టీకాలు అందించినట్లు తెలిపారు. పశువుల్లో వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య సిబ్బందికి సమాచారం అందించాలని ఆయన రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గుండువలస పాఠశాల ఎంఈఓ తనిఖీ



**జలుమూరు, మార్చి 24 (వార్త):** గుండువలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈఓ-1 బమ్మిడి మాధవరావు పరిశీలించారు. పాఠశాలకు చేరుకున్న ఆయన విద్యార్థులకు అందిస్తున్న బోధనపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల సామర్థ్యాలను పర్యవేక్షిస్తూ బోధన విధానాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మరింత మెరుగైన విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

# ఎంతటి వారైనా ఉపేక్షించవద్దు

**-అక్రమ మైనింగ్‌పై**

**ఎమ్మెల్యే గౌతు శిరీష ఉక్కుపాదం**



**పలాస, మార్చి 24(వార్త):** ఎంతటి వారైనా ఉపేక్షించ వద్దని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. పలాస నియోజకవర్గంలో కొంతకాలంగా మితిమీరిన అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకాలపై ఎమ్మెల్యే గౌతు శిరీష తీవ్ర మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. సహజ వనరులను కొల్లగొడుతున్న అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతూ, ఈ దందాను పూర్తిగా అరికట్టేందుకు రెవెన్యూ, పోలీస్ అధికారులతో అత్యవసర టెలికాన్ఫరెన్స్ నిర్వహించి కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. పగటిపూట అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిపే వాహనాలను పట్టుకుని, తక్షణమే వాటిని మైనింగ్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించాలని ఆదేశాలు జారీ చేశారు. రాత్రిపూట తవ్వకాలపై ఉక్కుపాదం మోపాలని, ఇకపై రాత్రి సమయాల్లో అనుమతులు లేకుండా ఎవరు తవ్వకాలు చేపట్టినా, వారి వాహనాలను వెంటనే సీజ్ చేసి కేసు నమోదు చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఈ విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించవద్దని, గట్టిగా హెచ్చరించారు. అక్రమ మైనింగ్ పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పట్టుబడిన ప్రతి వాహనంపై మైన్స్ యాక్ట్ సెక్షన్ 80 కింద కేసులు నమోదు చేసి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాంటి వాహనాలు పట్టుబడితే జరిమానాలు భారీగా పెంచాలని, అక్రమార్కులకు భయం పుట్టేలా, జరిమానాల మొత్తాన్ని గణనీయంగా పెంచాలని ఆదేశించారు. "సహజ వనరులు మనందరి ఉమ్మడి ఆస్తి. వాటిని కొల్లగొట్టే హక్కు ఎవరికీ లేదు. అక్రమ తవ్వకాలతో పర్యావరణాన్ని నాశనం చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు," అని గౌతు శిరీష స్పష్టం చేశారు. అక్రమార్కుల ఆట కట్టించి, ఈ దందాకు శాశ్వతంగా ముగింపు పలకాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే కఠిన వైఖరితో నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ మాఫియాకు కళ్లెం పడనుందని పలాస ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## జర్నలిస్టుల అక్రిడేషన్ నిబంధనలు సవరించండి

**-కలెక్టర్‌కు వివిధ సంఘాల నాయకులు, సీనియర్ జర్నలిస్టుల వినతి**

**శ్రీకాకుళం, మార్చి 24(వార్త):** జిల్లాలో వివిధ పత్రికల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడేషన్ మంజూరు చేయాలని సీనియర్ జర్నలిస్టులు, వివిధ సంఘాల ప్రతినిధులు మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమ ర్పించారు. అక్రిడేషన్ కమిటీ నిబంధనల మేరకు పూర్తిస్థాయిలో న్యాయం జరగ లేదని వారు అభిప్రాయపడ్డారు. గతంలో ఈ జిల్లాలో 1600 మందికి పైగా అక్రిడేషన్ మంజూరు చేశారని ఆయనకు గుర్తు చేశారు. కొన్ని నిబంధనలను సడలించి స్థానిక పత్రికలను ఆదుకోవాలని విన్నవించారు.

70% హాజరును పరిగణనలోకి తీసుకొని ప్రాధాన్య క్రమంలో అక్రిడేషన్ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. డివిజన్‌కు ఒక రిపోర్టర్‌కైనా అక్రిడేషన్ మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో వివిధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, వివిధ పత్రిక ఎడిటర్లు, సీనియర్ పాత్రికేయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జనసేన పార్టీ సభ్యత్వ విజయవంతం చేయాలి



**పలాస, మార్చి 24 (వార్త):** జనసేన పార్టీ సభ్యత్వ విజయవంతం చేయాలని నియోజవర్గం జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు అన్నారు. మంగళవారం పార్సీ గుట్ట ప్రాంతంలో జనసేన పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ దుర్గా రావు. పలాస నియోజకవర్గ ప్రాంతానికి చెందిన జనసైనికులు ఉపాధికోసం హైదరాబాద్ పార్సీగుట్ట ప్రాంతంలో నివశిస్తున్నారు. నియోజకవర్గ ఇంచార్జి చేపట్టిన జనసేనపార్టీ ఉద్యమి నమోదు కార్యక్రమంలో యువత , కార్మికులు అందరూ ఉత్సహంగా పాల్గొని సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు . ఈ సందర్భముగా దుర్గా రావు మాట్లాడుతూ . రాజకీయాలు అనగానే చాలామందికి అధికారమే గుర్తుకు వస్తుంది. కానీ కొన్ని ఉద్యమాలు మాత్రం అధికారానికి మించి సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో పుడతాయి. అలాంటి ఉద్యమాల్లో ఒకటి జనసేనపార్టీ. ఈ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాజకీయాన్ని ప్రజా సేవగా చూడాలని ఎప్పటికప్పుడు చెబుతూ వస్తున్నారన్నారు. ఆ ఆలోచనకు రూపమే జనసేన ఉద్యమి సభ్యత్వం. ఇది కేవలం ఒక సభ్యత్వ కార్డు కాదు. ఒక బాధ్యత, ఒక నమ్మకం, ఒక విలువ. సమాజంలో ఎవరికైనా కష్టం వచ్చినప్పుడు ముందుకు వెళ్లి చేయూత ఇవ్వాలనే మనసున్న ప్రతి ఒక్కరిని ఈ ఉద్యమం "ఉద్యమి"గా పరిగణిస్తుందని దుర్గా రావు తెలిపారు.

# పేదలకు ఇళ్లు, స్థలాలు ఇవ్వాలి

**-సీపీఐ డిమాండ్**

**-తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా**

**-టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని విజ్ఞప్తి**

**శ్రీకాకుళం, మార్చి 24 (వార్త):** అర్హులైన పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు, సాగు భూమి ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మంగళవారం శ్రీకాకుళం తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నప్పటికీ హామీల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. భూమిలేని నిరుపేదలకు సాగు భూమి పంపిణీ చేస్తామని చెప్పి అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. అలాగే టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని, జిల్లాలో భూమాఫియాను అరికట్టాలని, అర్హులైన వారికి రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జి. వసంతరావు, వై.వేణు, లక్ష్మీ, మల్లేష్, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.




## అసిరితల్లి సిరిమానోత్సవాల్లో ఎమ్మెల్యే




**జలుమూరు, మార్చి 24 (వార్త):** అంధవరం గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ అసిరితల్లి అమ్మవారి సిరిమానోత్సవాలు ఘనంగా నిర్వహించబడుతున్నాయి. ఈ సందర్భంగా నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన మంగళవారం హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ అర్చకులు సంప్రదాయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొని భక్తి భావంతో ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్ర నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ వెలమల చంద్రభూషణ్, పర్లాం డిస్ట్రిబ్యూటరి కమిటీ చైర్మన్ కింజరాపు సత్యనారాయణ, రేగాన సత్యనారాయణ, రేగాన మహేష్, అవురు తవుడు, అంధవరపు రవి, పల్లి తిరుమల, తలసముద్రం చలపతిరావు తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దూకులపాడు పాఠశాలను తనిఖీ చేసిన స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్



**నరసన్నపేట, మార్చి 24 (వార్త):** దూకులపాడు ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం సత్యవరం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ రత్నమాల పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించి పాఠశాల పరిస్థితులను తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యా బోధన అందుతుందని ఆమె పేర్కొన్నారు. పాఠశాలలో వంటశాల ఏర్పాటుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వడ్డినవలస పాఠశాలలో హోంవర్క్ పరిశీలన



**సారవకోట, మార్చి 24 (వార్త):** వడ్డినవలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల హోంవర్క్‌ను మంగళవారం ఎంఈఓ-2 కోడి భూలక్ష్మి పరిశీలించారు. పాఠశాలకు చేరుకున్న ఆమె విద్యార్థుల స్కూల్ వర్క్‌ను కూడా పరిశీలించి వారికి అవసరమైన సూచనలు, సలహాలు అందజేశారు. ప్రతిరోజు విద్యార్థులకు తప్పనిసరిగా హోంవర్క్ ఇవ్వాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. జీఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంపై కూడా తగిన శ్రద్ధ తీసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

## పోలాకిలో హెచ్‌పీవీ టీకా కార్యక్రమం

**పోలాకి, మార్చి 24 (వార్త):** పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ నిర్వహించారు. వైద్యాధికారి సుమప్రియ ఆధ్వర్యంలో 14 ఏళ్లు నిండిన బాలికలకు ఈ టీకాలను అందించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి రవికుమార్ మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ టీకాలు ఎంతో అవసరమని తెలిపారు. ప్రతి బాలికకు ఈ టీకా వేయించ్డం ద్వారా భవిష్యత్తులో వచ్చే ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని వివరించారు. పిల్లల ఆరోగ్యాన్ని కాపాడేందుకు తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## శ్రీముఖలింగేశ్వర ఆలయాన్ని దర్శించిన ఎస్టీ కమిషన్ అధ్యక్షుడు



**జలుమూరు, మార్చి 24 (వార్త):** శ్రీముఖలింగంలో ఉన్న శ్రీముఖలింగేశ్వర ఆలయాన్ని రాష్ట్ర ఎస్టీ కమిషన్ అధ్యక్షుడు సొళ్ల బొజ్జ రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ దర్శనం ఎంతో పవిత్రంగా భావిస్తున్నానని ఆయన తెలిపారు. భక్తుల కోరికలు నెరవేర్చే క్షేత్రంగా శ్రీముఖలింగేశ్వర ఆలయం విశేష ప్రాధాన్యత కలిగినదని పేర్కొన్నారు. ఈవో కె. ఏడుకొండలు ఆయనకు స్వామివారి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ శివప్రసాద్ పాడి, జలుమూరు ఎం.ఆర్.ఓ జె.రామరావు, ఆర్.ఐ జగదీష్, ఎస్.ఐ అశోక్

## తిమడాంలో ఉపాధి హామీ గ్రామసభ



**జలుమూరు, మార్చి 24 (వార్త):** తిమడాం పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన పనులపై మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధి హామీ అధికారులు, పంచాయతీ కార్యదర్శి సుశీల ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులపై చర్చ జరిగింది. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని చేపట్టాల్సిన పనులను గుర్తించి, వాటి ప్రాధాన్యతపై వేతనదారులకు వివరించారు. గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను ఎంపిక చేసి వాటిని అమలు చేయడానికి గ్రామసభ ఆమోదం పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ అధికారులు, పంచాయతీ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్ భారతీ, ఫీల్డ్ అసిస్టెంట్ జానర్దనరావు, ఎం.పి.టి.సి వెలమల దొరబాబు, నాయకులు వెలమల అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు అండగా నిలుద్దాం


* రాజ్యాంగ ఫలాలు అందిద్దాం
* ఎస్టీలపై దాడులు, వేధింపులను తీవ్రంగా పరిగణించాలి
* రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ళ బొజ్జిరెడ్డి



**శ్రీకాకుళం, మార్చి 24 (వార్త):** గిరిజనులు ఇబ్బంది పడే పరిస్థితి ఎక్కడా ఉండకూడదని, వారికి అందాల్సిన రాజ్యాంగ ఫలాలు సక్రమంగా అందుతున్నాయో లేదో చూడాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ళ బొజ్జిరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలోని గిరిజన సమస్యలు, వారి సంక్షేమ పథకాల అమలుపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఎస్టీలపై జరిగే దాడుల విషయంలో పోలీస్ శాఖ అత్యంత కఠినంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని చైర్మన్ ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న గిరిజన ఉద్యోగులపై పని ప్రదేశాల్లో వేధింపులు జరిగితే సహించేది లేదని, అటువంటి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐటీడీఏ పరిధిలో పనులన్నింటిలోనూ గిరిజనులకే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, స్కూళ్లలో విద్యార్థుల డ్రాపౌట్స్ లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో గిరిజన గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని, ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల కోసం నీడ, మంచినీరు వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. గిరిజనుల ముసుగులో తప్పుడు ధ్రువీకరణ పత్రాలు పొందిన వారిపై, అలాగే అక్రమంగా సంఘాలు నడుపుతున్న వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో కలర్ గ్రానైట్ పర్మిషన్ల అంశం కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చింది. గిరిజనులకు ఇబ్బంది కలిగించే వారి లీజులపై పునః సమీక్షించాలని ఆయన సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖలపై సమీక్షలో ఆయన చర్చించారు. గత రెండు రోజులుగా జిల్లాలో పర్యటిస్తున్న చైర్మన్ గిరిజనుల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ఆదివాసీ సంఘం నేతలు మాట్లాడుతూ.. గిరిజనులకు రాజ్యాంగపరమైన హక్కులు దక్కేలా చూడాలని, బోగస్ సర్టిఫికెట్లపై లోతైన విచారణ జరపాలని కోరారు. ఈ ఏడాది జిల్లాలో ఎస్టీలపై దాడులకు సంబంధించి ఒక్క కేసు కూడా నమోదు కాలేదని, గతేడాది 5 కేసులు నమోదయ్యాయని ఎస్పీ మహేశ్వర్ రెడ్డి సమావేశంలో వివరించారు. సమావేశంలో ఎస్టీ కమిషన్ సభ్యులు మల్లేశ్వరరావు, ఐటీడీఏ పీవో స్వప్నిల్ పవార్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్విరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్వీ లక్ష్మణమూర్తి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎం. అన్నాదొర, వివిధ శాఖల జిల్లా అధికారులు, అలాగే గిరిజన సంఘాల నేతలు చౌదరి లక్ష్మీనారాయణ, గేదెల రమణమూర్తి, బిడ్డిక తేజేశ్వరరావు, సవర కుమారి, సవర తులసి, ధరణి బైరిసింగి, బి.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

### ఆయా శాఖల్లో ఎస్సీ రోస్టర్ పాయింట్ అమలు చేయాలి

ఆయా శాఖల్లో ఎస్సీ రోస్టర్ పాయింట్ తప్పనిసరిగా అమలు జరగాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు రావాడ సీతారాం అధికారులను కోరారు. వైద్య ఆరోగ్య శాఖ, ఐఐఐటి, మున్సిపల్ కార్పొరేషన్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, ఎపిఈపీడిసియల్, తదితర శాఖల అధికారులతో ఆయన ఎస్సీ రోస్టర్ పాయింట్ అమలుపై మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖలలో రోస్టర్ పాయింట్ అమలు చేయాలని కోరారు. 2022 నుండి ఐఐఐటిలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి తెలియజేసిన వివరాలుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ వారం రోజుల్లో పూర్తి స్థాయి నివేదిక అందజేయాలన్నారు. ఈ ప్రాంతంలో బిఈ, బిటెక్, ఎంటెక్ పూర్తి చేసిన వారు ఉపాధి లేక ఖాళీ గా ఉన్నట్లు చెప్పారు. రిమ్స్ లో 2022 నుండి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి రోస్టర్ విషయంపై ఆరా తీశారు. పోస్టులు వారీగా రోస్టర్ పాయింట్ జరుగుతున్న అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. పాయింట్ల వారీగ జాబితా అందజేయాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో 2022 నుండి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎస్సీ రోస్టర్ పాయింట్ అమలు గూర్చి కమీషన్ సభ్యులు అడుగగా జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖలో చేపట్టిన రిక్రూట్‌మెంట్ పై డిఎంహెచ్ఓ డాక్టర్ అనిత వివరించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో 2022 నుండి రిక్రూట్‌మెంట్ జరగలేదని పరిపాలనాధికారి చెప్పారు. రాష్ట్ర స్థాయిలో ఫిర్యాదు అందినదని, కింది స్థాయిలో పోస్టులు తీసినట్లు కమిషన్ సభ్యులు సీతారాం తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి ఎస్సీ రోస్టర్ పాయింట్లు అమలు గూర్చి అడిగి తెలుసుకొని రోస్టర్ పాయింట్ అమలు జరగాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న పనులు విషయం పై ఈ ప్రొక్యూర్ మెంట్ లో ఎస్సీ కోటాను అమలు చేయాలన్నారు. 2022 నుండి ఇప్పటి వరకు ఎంత బడ్జెట్ ఇందులో 20 శాతం పనులు ఎస్సీలకు కేటాయించారా లేదా బడ్జెట్ వివరాలు కోరారు. ఎపిఈపీడిసియల్ ఎస్ఈ కృష్ణమూర్తి రోస్టర్ పాయింట్ అమలు పై వివరించారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె. వినాయకం, ఆయా శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు, కార్యాలయాల పరిపాలనాధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర సచివాలయం ముట్టడిస్తాం

### - యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్



**పలాస, మార్చి 24(వార్త):** పలాస నియోజకవర్గ యుటిఎఫ్ రణభేరి 3.0 ఒకరోజు నిరాహార దీక్షను పలాస తహసిల్దార్ కార్యాలయం వద్ద 12వ పిఆర్సీ అమలు, పెండింగ్ డిఏల విడుదల, ఆర్థిక బకాయిల సాధన కోసం చేపట్టినట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ తెలిపారు. మంగళవారం పలాస నియోజకవర్గంలో తహసిల్దార్ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ సంఘ బోర్డు డైరెక్టర్ గుంట కోదండరావు, జిల్లా కార్యదర్శి కంచరాన రమేష్ ఆధ్వర్యంలో జరిగిన నిరాహార దీక్షలో ఆయన మాట్లాడుతూ రణభేరి 3.0 కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ నిరంకుశ వైఖరిని వ్యతిరేకిస్తూ అన్ని తాలూకా కేంద్రాలలో ఒకరోజు నిరాహార దీక్ష చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. ఎన్నికలకు ముందు కూటమి పెద్దలు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదన్నారు. 12వ పిఆర్సీ గడువు ముగిసి మూడేళ్లవుతున్నా , పిఆర్సీ అమలుకు ప్రయత్నించకపోవడం ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరిని తేటతెల్లం చేస్తున్నదన్నారు. వైసీపీ హయాంలో నియమించిన పిఆర్సీ చైర్మన్ డాక్టర్.మన్మోహన్ సింగ్ తన బాధ్యతలకు రాజీనామా చేసినప్పటికీ నూతన చైర్మన్ ను నియమించకపోవడం తగదన్నారు.తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలను అమలు చేయడంతో పాటు,ఆర్థిక బకాయిలన్నిటినీ ఆరు మాసాలలోగా చెల్లిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆ వైపుగా కనీసం ఆలోచించకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఆర్థిక బకాయిల చెల్లింపులపై రోడ్డు మ్యాప్ ప్రకటించి డి.ఏ లను ఎప్పటికప్పుడు చెల్లిస్తామని ఇచ్చిన హామీ మేరకు 4 డిఏలు చెల్లించాల్సి ఉండగా, ఒక్క డిఏ మాత్రమే చెల్లించి చేతులు దులుపుకోవడం తగదన్నారు. సరెండర్ లీవ్ బకాయిలను నాలుగేళ్లుగా చెల్లించడం లేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే విషయంలో ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు.తక్షణం నూతన పిఆర్సీ ని ఏర్పాటుచేసి, పిఆర్సీ అమలయ్యే వరకు 29 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర సచివాలయాన్ని ఏప్రిల్ నెలలో ముట్టడిస్తామని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ రిటైర్డ్ ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే చెల్లించాలని, మెమో నెంబర్ 57 అమలు చేయాలని,పాత పెన్షన్ పునరుద్ధరించాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ పరిష్కరించాలని, బకాయి పడ్డ సరెండర్ లీవ్ లు చెల్లించాలని, ఉపాధ్యాయుల ఆరోగ్య పథకానికి సంబంధించిన మెడికల్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టిన రాష్ట్ర కౌన్సిలర్ బల్ల చిట్టిబాబు ,కింతలి సుజాత, సిహెచ్ సుగుణ, గొల్వే మీనాక్షి, ఎన్ జయంతి, బి రామ తులసి,రాజ్యలక్ష్మి, పద్మావతి, వందన, హేమలతలకు నిమ్మరసం ఇచ్చి రాష్ట్ర కార్యదర్శి ఎస్ కిషోర్ కుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి శ్రీరామ్ మూర్తి లు దీక్షను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జయరామ్ మాలి, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్ వెంకటాచలం, పూర్వపు జిల్లా కార్యదర్శి గున్న రమేష్, పలాస ,వజ్రపు కొత్తూరు, మందస అధ్యక్ష ,కార్యదర్శులు తమ్మినేని జయరాం ,ఎస్ వి రమణ ,చౌక్కరి ధర్మారావు, రత్నాల సురేష్,జగదీష్ బడిత్య, దాసరి ఈశ్వరరావు, కంచరాన జయరాం, ఎల్ డిలేశ్వరరావు, కంచరాన ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొని డిప్యూటీ తహసీల్దార్ వి గిరిబాబు ద్వారా ప్రభుత్వానికి వినతి పత్రాన్ని అందజేశారు.

## గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయం : కూన



**సరుబుజ్జిలి, మార్చి 24(వార్త):** గ్రామాల్లో శత శాతం మౌలిక వసతుల కల్పనే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సరుబుజ్జిలి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మండలంలోని అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. గ్రామ స్థాయిలో ఎదురవుతున్న సమస్యలను అధికారుల ద్వారా తెలుసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. మండలంలో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని తెలిపారు. మండల అభివృద్ధికి అందరూ సమన్వ



యంతో కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పావని, ఎంపీపీ కిల్లి రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


# టమాట పంట పరిశీలన



**సోంపేట, మార్చి 24(వార్త):** జింకిభద్ర, బెంకిలి, పలాసపురం గ్రామాల్లో వందలాది ఎకరాల్లో సాగు చేస్తున్న టమాట పంట ఈ ఏడాది రైతులకు నష్టాలను మిగిల్చింది. పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం, కొనుగోలు చేసే వ్యాపారులు సిండికేట్ గా మారి ధరలు బాగా తగ్గించడం, చిన్నపాటి తెగుళ్లు మొదలైన సమస్యలతో రైతన్నలు ఎన్నడూ లేనివిధంగా తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుక మంగళవారం జింకిభద్ర, బెంకిలి గ్రామాల్లో పర్యటించారు. నేరుగా రైతులను కలిసి పరిస్థితులను గూర్చి చర్చించారు. వ్యాపారులు సిండికేట్ గా మారి ధరలు బాగా తగ్గించారని రైతులు ఆరోపించారు. ఇటువంటి పరిస్థితి నుంచి ప్రభుత్వం రైతులకు రక్షణ కల్పించి మార్కెటింగ్ విషయంలో మేలు చేయాలని ఆమెను కోరారు.

23 కిలోల టమాటా ట్రే ధరను 70 నుంచి 80 రూపాయలకు మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోయారు. రిటైల్ మార్కెట్‌లో కిలో పది రూపాయలుగా విక్రయిస్తున్నారని తెలిపారు. కనీసం 150 రూపాయలు ట్రే కు చెల్లించినా కొంత గిట్టుబాటు అవుతుందని పేర్కొన్నారు. ఈ పరిస్థితి ని ఉన్నతధికారులకు నివేదిస్తానని సెక్రటరీ ప్రసన్న పేర్కొన్నారు.

# తాగునీటి నాణ్యతను తరచూ పరీక్షించండి




**జి.సిగడాం, మార్చి 24(వార్త):** వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ప్రజలకు అందించాలి. ఇందులో భాగంగా తరచూ తాగునీటి నాణ్యతను పరీక్షించాలి మండల ప్రజా పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు మీసాల వెంకట రమణ, ఎంపీడీఓ జి.రామకృష్ణారావు సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్డ్ బ్యూసీ ఎఈ కుసుమ అధ్యక్షతన తాగునీటి సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన ముందస్తు



చర్యలపై పంచాయతీ కార్యదర్శులు,ఇంజనీరింగ్ అసిస్టెంట్లలతో సమీక్షించారు.గ్రామాల్లో త్రాగునీటి నాణ్యత ప్రమాలపై ఒక రోజు శిక్షణ సమావేశం నిర్వహించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులను స్థానిక సంబదిత అధికారులు ప్రతివారానికి ఒక సారి పరిశీలించి 15 రోజులకు ఒకసారి క్లీనింగ్ చేయాలని, ఆ ఫొటోలు తీసి తనకు పంపాలన్నారు. మరమత్తులకై లీకేజీ ఉన్న పైపులను ఉన్నచో తక్షణమే తెలియజేస్తే వెంటనే , బాగు చేయటకు,రీప్లేస్ చేయుటకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. లేదంటే మురుగు చేరి, నీరు కలుషితమై వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు.



## పీఆర్సీ ఏర్పాటు చేయాలంటూ ధర్నా

**నరసన్నపేట, మార్చి 24 (వార్త):** ఉపాధ్యాయులకు మేలు జరిగేలా ప్రభుత్వం తక్షణమే పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని జిల్లా యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు వైకుంతరావు, ప్రధాన కార్యదర్శి శ్రీరామమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం నరసన్నపేట తహశీల్దార్ కార్యాలయం ఎదుట యుటీఎఫ్ రణభేరి కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. పీఆర్సీ కమిషన్ ఏర్పాటు ద్వారా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని వారు పేర్కొన్నారు. సాయంత్రం వరకు ధర్నా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎస్సీ కమిషన్ 59 ఉప కులాలకు ఒక రక్షణ కవచం

**శ్రీకాకుళం, మార్చి 24 (వార్త):** ఎస్సీ కమిషన్ 59 ఉప కులాలకు ఒక రక్షణ కవచం లాంటిదని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు రావాడ సీతారాం వెల్లడించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వినతులు స్వీకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మంగళవారం వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషన్ అధ్యక్షులు ఆదేశాల మేరకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకొని చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలోని కొన్ని జిల్లాల్లో పర్యటించి ఇప్పటికే కొన్ని భూ సమస్యలు, ఇతర సమస్యలు పరిష్కరించినట్లు చెప్పారు. దళిత నాయకులు గోకర్ల నారాయణరావు మాట్లాడుతూ దళితుల సమస్యలను, జిల్లాలో ఎస్సీలపై జరుగుతున్న దాడులను కమిషన్ సభ్యులకు వివరించారు. కులాంతర వివాహాలకు ప్రోత్సాహక బహుమతులను కమిషన్ దృష్టిలో పెట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎపిఈఈడబ్ల్యుఐడిసి డెరక్టర్ పిఎంజె బాబు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె. వినాయకం, భూ గర్భ గణులు శాఖ ఉప సంచాలకులు మోహనరావు, రెసిడెన్షియల్ స్కూల్స్ జిల్లా కో ఆర్డినేటర్ వై. యశోదలక్ష్మి, దళిత నాయకులు తైక్వాండో శ్రీనివాసరావు, వేణుగోపాలరావు, పాపారావు పాల్గొన్నారు

## ప్రజా ఫిర్యాదులను పారదర్శకంగా పరిష్కరించాలి

* ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో విచారణ చేయండి
* విజిబుల్ పోలీసింగ్, ఎన్ఫోర్స్‌మెంట్ చర్యలపై దృష్టి సారించండి
* జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి

**శ్రీకాకుళం, మార్చి 24 (వార్త):** పబ్లిక్ గ్రీవెన్స్‌లో స్వీకరించిన ప్రజా ఫిర్యాదులపై త్వరితగతిన చర్యలు చేపట్టి, ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పారదర్శకంగా పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీ, సర్కిల్ ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులతో కలిసి ఎస్పీ పీజీఆర్ఎస్ ఫిర్యాదులు, విజిబుల్ పోలీసింగ్, ఎన్ఫోర్స్‌మెంట్ చర్యలు, కార్యాలయ పరిపాలన విధానం, కోర్టు సంబంధిత అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పరిపాలన, పోలీసు సిబ్బందికి సంబంధించిన అన్ని అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు ఈ ఆఫీస్ విధానం ప్రకారం జరగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీసు స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ల పనితీరును డీఎస్పీ, సీఐ స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రతి రోజు గ్రామాలలో సందర్శనలు నిర్వహించి, ప్రజలతో మమేకమై ముఖ్య కూడళ్లలో 'నారీ శక్తి - సంకల్పం' పేరిట మహిళలు, బాలికల భద్రత, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు, సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. బాణాసంచా తయారీ, విక్రయాలు, నిల్వ కేంద్రాలపై తనిఖీలు నిర్వహించి, నియమ నిబంధనలు, అనుమతులు, లైసెన్సులను కచ్చితంగా పరిశీలించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న నాన్-బెయిలబుల్ వారెంట్లను తక్షణమే అమలు చేయాలన్నారు. ఎన్ఫోర్స్‌మెంట్ చర్యల్లో భాగంగా హెల్మెట్ ధారణపై విస్తృత అవగాహన కల్పించి, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే, రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ కె.వి. రమణ, డీఎస్పీలు వివేకానంద, లక్ష్మణరావు, గోవిందరావు, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546